సమస్యల కూత వినిపించదా?

నెల్లూరు నగరానికి ఉండే మూడు రైల్వే స్టేషన్లలో వేదాయపాళెం స్టేషన్ ప్రధానమైనది. నగర నడిబొడ్డున వేదాయపాళెం ఉండడంతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఈ రైల్వేస్టేషన్‌నే వినియోగించుకుంటారు. అయితే మౌలిక వసతులైన మరుగుదొడ్లు, కుర్చీలు, షెడ్లతో పాటు సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని వేదాయపాళెం రైల్వేస్టేషన్

- కరెంటు ఎప్పుడు పోతుందో తెలియని వైనం
- కనీస వసతులు మృగ్యం

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో ఆగే రైళ్ల సంఖ్య తక్కువే అయినా ఆయా రైళ్ల నుంచి దిగే వారు, ఎక్కే వారు ఎక్కువగా ఉంటారు. అందుకు తగ్గట్లు ఇక్కడ వసతులు లేకపోవడం గమనార్హం. ఇక్కడ చీకటి పడితే స్టేషన్‌లో ఎప్పుడు కరెంటు పోతుందో.. వస్తుందో తెలియని పరిస్థితి. రైలు వచ్చే సమయంలో తెలిపే సూచిక బోర్డులు అస్సలు కనిపించవు. వర్షం పడితే చెట్టు నీడే దిక్కు. ప్లాట్‌ఫారాలు మారాలంటే లిఫ్ట్ సౌకర్యం కూడా లేదు. వెరసి వేదాయపాళెం రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి.

పెద్ద సమస్యగా విద్యుత్

నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో మొత్తం మూడు ప్లాట్‌ఫారాలు ఉంటాయి. ఈ స్టేషన్ నుంచి నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు దాదాపుగా 1,500 మంది నుంచి 1,700 మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ స్టేషన్‌లో రోజుకు 12 రైళ్లు ఆగుతుంటాయి. రైల్వే వ్యవస్థ అంటేనే కరెంటుకు సమస్య ఉండదని అంటారు. వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటుంది. సాయంత్రం దాటితే ఎప్పుడు కరెంటు తీస్తారో, ఇస్తారో తెలియని పరిస్థితిలో ప్రయాణికులు మాత్రం ఆ చీకట్లోనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటోంది. గత కొంత కాలంగా నిత్యం కరెంటు సమస్యతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ ముఖద్వారం

కనిపించని బోర్డులు.. లేని లిఫ్ట్

సాధారణంగా ఏ చిన్న రైల్వేస్టేషన్‌లో అయినా రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో స్టేషన్‌లో కోచ్ పొజిషనింగ్ తెలిపే లైటింగ్ బోర్డులు ఉంటాయి. కానీ వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో మాత్రం అవి కనిపించవు. రైలు వచ్చే చివరి నిమిషంలో కోచ్ పొజిషన్‌లు తెలిపేలా మైకులో చెప్పి వదిలేస్తుంటారు. దీంతో ప్రయాణికులు ఆ సమయంలో ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారం వెళ్లాలంటే కొండ ఎక్కినట్లు ఫుట్ ఓవర్ బ్రిడ్జినే వినియోగించక తప్పదు. లిఫ్ట్ సౌకర్యం లేకపోవడంతో పెద్దలు, వృద్ధులు ప్లాట్‌ఫారాలు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వానొస్తే చెట్టు కిందే..

ఈ రైల్వేస్టేషన్‌లో టికెట్ కౌంటర్ వద్ద, మరోచోట రైలు బోగీ పొడవులో షెడ్డు ఉంటుంది. మిగిలిన ప్రాంతమంతా కనీసం కుర్చీలు, షెడ్లు లేకపోవడం గమనార్హం. వర్షం వస్తే ఒక షెడ్డు కిందే అందరూ ఉండి, రైలు వచ్చిన సమయంలో తడుచుకుంటూ పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రెండు వైపులా కనీసం షెడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. నిత్యం వందల్లో ప్రయాణాలు సాగించే ఈ రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లు కూడా లేకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. ఈ రైల్వేస్టేషన్‌పై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చివరి నిమిషంలో ఉరుకులు పరుగులు

వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం వద్ద ప్రహరీని నిర్మించి ఉంటారు. దీనివల్ల మూడో ప్లాట్‌ఫారం కొంచెం దూరంగా ఉంటుంది. మెమూ రైళ్లు చెన్నై వైపు వెళ్లడానికి రెండో నంబర్ ప్లాట్‌ఫారంను వాడుతుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో చివరి నిమిషంలో మూడో ప్లాట్‌ఫారం మారినట్లు మైక్‌లో చెబుతారు. దీంతో ప్రయాణికులు పరుగులు పెట్టి ప్లాట్‌ఫారాలు మారాల్సిన పరిస్థితి ఉంది.


ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై కనుచూపు మేర లేని కుర్చీలు, షెడ్లు, కోచ్ పొజిషన్ బోర్డులు


ఫుట్ ఓవర్ బ్రిడ్జి

షెడ్లు ఏర్పాటు చేయాలి

వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు షెడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అదే విధంగా రాత్రి వేళల్లో స్టేషన్లో కరెంటు ఉండడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించాలి.

– నిరంజన్, ప్రయాణికుడు

సూచిక బోర్డులు ఉండాలి

వేదాయపాళెం రైల్వేస్టేషన్‌లో రైలు బోగీల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. చివరి నిమిషంలో మైకులో చెప్పే సమాచారం అర్థం కాదు. దీంతో రైలు వచ్చిన సమయంలో పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో పాటు లిఫ్ట్ లేదా ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేయాలి.

– హర్ష, ప్రయాణికుడు

క్లుప్తంగా

సింహపురిలో ఫుడ్ ఫెస్టివల్



నెల్లూరు(బృందావనం) : దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వెజ్, నాన్‌వెజ్ కబాబ్, బిర్యానీలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్‌ను పోలీ సాఫీస్ రోడ్డులోని హోటల్ సీజన్స్ ఇన్, పెన్నా రెస్టారెంట్‌లో సోమవారం ప్రారంభించినట్లు ఆ హోటల్ జనరల్ మేనేజర్ నాగూర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. నగరంలో ఎక్కడా లేనివిధంగా 20 రకాల కబాబ్, మరో 16 రకాల బిర్యానీలను నెల్లూరీయులకు ఈ ఫుడ్‌ఫెస్టివల్ ద్వారా అందిస్తున్నామన్నారు. ప్రతి నిత్యం మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 వరకు, రాత్రి 7 నుంచి 10.30 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ ఉంటుందన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


విశేషాలంకారంలో వినాయక స్వామి

నెల్లూరు(బృందావనం) : పుర మందిరం ప్రాంగణంలోని జ్యోతి వినాయక మందిరంలో ఈనెల 6వ తేదీ నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసింది. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారికి అభిషేక పూజలు, పూలంగి సేవలు, అలంకారోత్సవాలు, హోమాలు నిర్వహించారు. 1,200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని టౌన్‌హాల్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- క్షతగాత్రులు నెల్లూరు వాసులు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కంటేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు పద్మావతి సెంటర్‌కు చెందిన భాను ప్రకాష్, వెంకటేశ్వర్లు పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వెళ్లారు. పని ముగిసిన తర్వాత ఇంటికి బయలుదేరారు. కంటేపల్లి సమీపంలో ఆటో అడ్డురావడంతో వారి బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో భాను ప్రకాష్, వెంకటేశ్వర్లు గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్న విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

- రాష్ట్ర ఉద్యానాధికారి నుంచి రైతుకు అభినందన


సాగును పరిశీలిస్తున్న రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

నెల్లూరు సిటీ: ఓ రైతు సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టాడు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా పంటను తానే విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆ రైతును సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెం గ్రామంలో వి.ధనంజయరెడ్డి అనే రైతు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. 7,500 మొక్కలు నాటారు. సాగులో సరికొత్త విధానాలు అవలంభిస్తున్నారు. ట్రాక్టర్‌తో సేద్యం చేసేందుకు వీలుగా ప్రతి వరుసకు 11 అడుగులు ఉంచారు. ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో తొలిసారిగా టూ టైర్ సిస్టం ద్వారా రెట్టింపు ఫల సాయం పొందుతున్నారు. ఈ వినూత్న పద్ధతిని సామాన్య, చిన్న తరహా రైతులకు అందించాలని ఉద్యాన డైరెక్టర్ కె.శ్రీనివాసులు రైతును కోరగా, తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డి, ఏడీహెచ్ శ్రీకాంత్ రెడ్డి, దీపిక, హెచ్ఓ ఆనంద్ పాల్గొన్నారు.

అన్నదానం



నెల్లూరు(బృందావనం) : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా టైలర్స్‌కాలనీ మసీద్ సెంటర్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్గా నిషాన్ కమిటీ పర్యవేక్షించింది.

ఆత్మీయ సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వెంకటేశ్వరపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమనోహర్‌ను ఎంటీఎఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సన్మానం చేశారు. స్థానిక ఎంటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఎంటీఎఫ్ నేతలు వెంగళరావు, సురేష్ బాబు, అబ్దుల్‌రహీం, వీరభద్రుడు పాల్గొన్నారు.


రాజమనోహర్‌ను సన్మానిస్తున్న ఎంటీఎఫ్ నాయకులు

పీసీసీ ఉపాధ్యక్షుడికి..

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర (పీసీసీ) ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌ను సోమవారం పలువురు సన్మానించారు. నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న ఆయన కార్యాలయంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఏఆర్కే రాజు, సురేష్‌రెడ్డి,సుబ్బారెడ్డి, రాజశేఖర్‌యాదవ్, సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.


వెంకట్రావ్‌యాదవ్‌కు సన్మానం

రాజాగౌతమ్‌కు అవార్డు

నెల్లూరు సిటీ : ఇంజినీర్స్ డే సందర్భంగా నెల్లూరుకు చెందిన రాజాగౌతమ్‌కు 2024 ఉత్తమ ఇంజినీర్ అవార్డు వరించింది. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో ఆదివారం ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రాజాగౌతమ్ సోమవారం మాట్లాడుతూ ఉత్తమ ఇంజినీర్–2024 అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.


అవార్డు అందుకుంటున్న రాజాగౌతమ్

మన్నించయ్య.. గణపయ్య



నగరంలోని స్వర్ణాల చెరువులో గణేశ్ నిమజ్జనాలు జరిగి ఐదు రోజులు గడుస్తున్నా.. సగం మునిగిన గణపయ్య విగ్రహాలు అలానే దర్శనమిస్తున్నాయి. వీటిని పూర్తిస్థాయిలో నిమజ్జనం చేయడం అధికారుల బాధ్యత. అయితే ఎవరూ పట్టించుకోకపోవడంతో చెరువు ముందు భాగంలోనే గణనాథుల విగ్రహాలు తేలియాడుతున్నాయి. విగ్రహాల శిథిలాలను శుభ్రపరచడంతో పాటు నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు






బోధనలు చేస్తున్న మత పెద్దలు


విద్యుత్ కాంతులతో ప్రత్యేక వాహనం

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

నెల్లూరు(బృందావనం) : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీని నగరంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కామాటివీధిలోని ఆయేషా మసీదు నుంచి సంప్రదాయంగా 'జులుసు' (ప్రదర్శన) నిర్వహించారు. నగరంలో జరిగిన జులుసులో మతపెద్దలు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గుర్రాలు, ఒంటెలు, ప్రత్యేక వాహనంపై సుందరంగా, నయనా నందకరంగా తీర్చిదిద్దిన మక్కా, మసీదు నమూనాలతో నగరోత్సవం కోలాహలంగా సాగింది. తొలుత సాంప్రదాయబద్ధంగా దువా చేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు వివరించారు. అల్లాహ్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ సాగాలని సందేశమిచ్చారు. వీరి ప్రదర్శన కామాటి వీధిలోని ఆయేషా మసీదు నుంచి ప్రారంభమై కోటమిట్ట, జెండావీధి షాదీమంజిల్, చేపల మార్కెట్, వహబ్‌పేట, బారకాసు సెంటర్, ఆచారివీధి, మద్రాస్ బస్టాండ్, వీఆర్సీ, గాంధీబొమ్మ, ఏసీ సెంటర్, ములుముడి బస్టాండ్, చిన్నబజారు, పెద్దబజారు మీదుగా కోటమిట్ట చేరింది.


విద్యుద్దీపాలంకరణలో మసీదు




జులుసులో చిన్నారులు, పెద్దలు

గాయపడిన వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్) : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చింతారెడ్డిపాళెం (మెడికవర్ హాస్పిటల్ వెనుకవైపు)లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎస్.రవికుమార్(60), మైథిలి దంపతులు నివాసం ఉంటున్నారు. రవికుమార్ అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఓ జూనియర్ కళాశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం నెల్లూరు జాతీయ రహదారిపై కాఫీ కేఫ్ వద్ద బైక్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా చెన్నై వైపు నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన ఆయన్ను స్థానికులు చికిత్స నిమిత్తం నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైలోని సిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రవికుమార్ సోమవారం మృతిచెందారు. ఈ మేరకు మృతుని సోదరుడు వెంకటరమణరావు సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో నెల్లూరు జట్ల ప్రతిభ


ద్వితీయ స్థానం సాధించిన బాలుర జట్టు


తృతీయ స్థానం సాధించిన బాలికల జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కర్నూలులో జరిగిన తొమ్మిదో రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యా– పాట్యా చాంపియన్ షిప్–2024 పోటీల్లో నెల్లూరు జిల్లా బాల, బాలికల జట్లు ప్రతిభ చూపారని అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ పోటీల్లో ఆట్యా-పాట్యా బాలుర జట్టు ద్వితీయ స్థానం సాధించగా బాలికల జట్టు తృతీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. బాలుర జట్టులో జి.సురేంద్ర, టి.సంతోష్, బాలికల జట్టులో బి.సబిత, ఎ.ప్రత్యూష జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు నవంబర్ 5, 6, 7వ తేదీల్లో పుదుచ్చేరిలో జరిగే జాతీయస్థాయి ఆట్యా-పాట్యా పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆట్యా-పాట్యా జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ప్రసాద్, సెక్రటరీ కె.కృష్ణవేణి అభినందించారు.